క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించండి

అయినవిల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు నల్లచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. డివిజనల్ నాయకుడు గుంద్రు సత్యనారాయణ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. అనంతరం అయినవిల్లి మండల పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గుమ్ములూరి అనిల్‌కుమార్, సెక్రటరీగా తాడి శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోల నాగబాబు, దాకి జార్జి, గుర్రం రాంబాబు, కాగిత రామకృష్ణ, రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

అంబాజీపేట: చిన్నారులను పనుల్లో పెట్టుకుంటే శాఖా పరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ అధికారి ఎ.విజయ్‌ప్రకాష్ అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా అంబాజీపేటలో బేకరీలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, మాచవరంలో ఇటుక బట్టీలతో పాటు పలు షాపులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయసు గల పిల్లలను ప్రమాదకర పనుల్లో పెట్టుకోకూడదన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే తీసుకునే చర్యలపై షాపు, ఇటుక బట్టీల నిర్వాహకులకు వివరించారు. సీఆర్ఎంటీ ఎస్.వెంకటేష్, కానిస్టేబుల్ రమణ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మామిడికుదురు: నగరం గ్రామంలో బీబీ సకీనా ఆస్థానం వద్ద మండల పరిషత్ నిధులు రూ.మూడు లక్షలతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ నిధులను మండల పరిషత్ నుంచి కోఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్ మంజూరు చేయించారు. కో–ఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, సర్పంచ్ జాలెం రమణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు జాలెం అనూషలు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు సైతం సీసీ రోడ్లు నిర్మిస్తే ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందన్నారు. నాయకులు ముకరం హుస్సేన్, సజ్జాద్ హుస్సేన్, కుసుమ శ్రీధర్, జాలెం సుబ్బారావు, అన్వర్ తాహిర్ హుస్సేన్, కడలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



సఖినేటిపల్లిలంకలో నీలిమ తండ్రి కొండలరావుకు సాయం చేస్తున్న పెద్దలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మార్గాన నీలిమకు చికిత్స నిమిత్తం స్థానిక నాయకుడు యల్లమెల్లి కిశోర్ రూ.50 వేలు గురువారం అందించారు. దాత గొల్లమందల బాలరత్నం ద్వారా నీలిమకు పైమొత్తాన్ని కిశోర్ సమకూర్చారు. ఈ మేరకు నీలిమ తండ్రి కొండలరావుకు, గ్రామపెద్ద రేవూరి ఏసు నరసింహరాజా, చల్లా నాగరాజు, కొండా కిశోర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పప్పుల శివప్రసాద్, ముత్యాల చిన్నా, చింతా పండు, వాడపల్లి రాజబాబు, తాడి సహదేవ్, నల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి చేయూత



బాధితుడి భార్యకు సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ గుడిపై నుంచి జారిపడిన వ్యక్తికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు చేయూత అందించారు. ర్యాలి గ్రామానికి చెందిన రౌతు నాగభూషణం రెండు వారాల కిందట ఆత్రేయపురంలో పెయింటింగ్ పనిచేస్తూ గుడిపై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో రెండు ఆపరేషన్లు చేశారు. బాధిత కుటుంబం వైద్యం చేయించుకోవడానికి సహాయం కోరడంతో కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు కలసి నాగభూషణం భార్య నాగ మానసకు రూ.10 వేలను అందజేశారు.

సారా స్వాధీనం

రావులపాలెం/కొత్తపేట: ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని గురువారం తెలిపారు. కొమరాజులంక గ్రామానికి చెందిన అత్తిలి సతీష్ వద్ద 40 లీటర్లు, కొత్తపేట మండలం ఏనుగు మహల్‌కు చెందిన కుడిపూడి దుర్గారావు వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రాజోలు కోర్టు మేజిస్ట్రేట్ వద్ద హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

● చినుకులు.. మాసూళ్లు



మామిడికుదురు బైపాస్ రోడ్డుపై ధాన్యం మాసూళ్లు

మామిడికుదురు: అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆకాశంలో అలముకున్న మబ్బులతో పాటు చినుకుల మధ్య మాసూళ్లు చేసుకుంటూ గురువారం తీవ్ర అగచాట్లు పడాల్సి వచ్చింది. మామిడికుదురు 216వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పొడవునా ఇదే దృశ్యాలు కనిపించాయి. కోత కోసిన పంట చేలలో పనలపై ఉండిపోయింది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోని రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పనలను రోడ్డుపైకి తీసుకు వచ్చి వాటిని మాసూళ్లు చేసుకున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా ఎక్కువ కూలీ ఇచ్చి పంటను ఒబ్బిడి చేసుకున్నారు. మామిడికుదురు మండలంలో 60 శాతం పంట మాత్రమే కోతలు కోశారు. మిగిలిన పంట కోత దశకు వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఏర్పడిన అల్పపీడనం రైతులకు నష్టం కలిగిస్తోంది.

● పెంట కాలువ ఇది..



మామిడికుదురు పంట కాలువలో పేరుకుపోయిన చెత్త

మామిడికుదురు: మామిడికుదురులోని పంట కాలువలో భారీగా చెత్త పేరుకుపోయింది. సాగునీటి సరఫరాకు తీవ్ర ప్రతిబంధకం ఏర్పడుతోంది. గ్రామ దేవత నూకాలమ్మ ఆలయం సమీపంలో పంట కాలువలో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్ వద్ద తరచూ భారీగా చెత్త పేరుకుపోతుంది. దీనివల్ల సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. కాలువలో పైప్‌లైన్ కిందకు ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. చాలా కాలం నుంచి ఈ సమస్య వేధిస్తోంది. శాశ్వత పరిష్కారానికి పైప్‌లైన్‌ను మార్పు చేయాల్సి ఉంది. కానీ అది ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● దారిలోకి తేవాలి



ఇసుకపూడిలో అధ్వానంగా మారిన ప్రధాన రహదారి

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గుంతలు పడ్డాయి. నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ప్రమాద భరితంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో పాటు గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అటుగా పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు వెళ్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డులో ఇప్పటికే అనేకమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. రహదారిని అభివృద్ధి చేస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రహదారిని బాగుచేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు.

దుకాణం సర్దేశారు..

- నిత్యావసరాల దుకాణం నిత్యం మూతే
- మూణ్నాళ్ల ముచ్చటగా మారిన వైనం
- ధరలు మండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

అంబాజీపేట: వంటింట్లో ధరల మంట మండుతోంది.. ఉప్పు నుంచి పప్పు వరకూ ప్రతిదీ కొండెక్కి కూర్చుంటోంది.. మార్కెట్లో ధరల దెబ్బ సామాన్యుల నడ్డివిరిచేట్టు ఉంది.. ఏం కొనలేం, తినలేం అన్నట్లు పరిస్థితి దాపురించింది. ఈ ధరల పెరుగుదలను చూసిన కూటమి ప్రభుత్వం వెంటనే నిత్యావసర సరకులు పేదలకు అందుబాటులో తీసుకు వస్తామంటూ ప్రగల్భాలు పలికింది. మార్కెట్ కంటే తక్కువ ధరకు సరకులు విక్రయించేలా అంబాజీపేటలో హడావుడిగా ఓ దుకాణం తెరిచింది. ఇది జరిగి సరిగ్గా రెండు నెలలు పూర్తయ్యింది. అయితే ఈ దుకాణం వల్ల పేదలకు ఒరిగిందేమి లేదు. పది రోజులు మాత్రమే దీనిని తెరిచారు. ఉల్లి పాయలు, వంట నూనెలు విక్రయించారు. అబ్బో బాగుందే అనుకునే లోపే మొత్తం సర్దేశారు. దుకాణానికి తాళాలు వేసి ఎప్పుడూ మూసే ఉంచుతున్నారు. ప్రజలు మాత్రం రోజూ ఈ దుకాణం వద్దకు వెళ్లి నిరాశగా తిరిగి వస్తున్నారు. ఈ దుకాణంలో టమాటాలు, ఉల్లిపాయలు, వంట నూనెలు అమ్మేలా అక్టోబర్‌లో ఆర్భాటంగా ప్రారంభించారు. నాడు షాపు తెరిచిన సమయంలో ఉల్లి మార్కెట్లో రూ.70 నుంచి రూ.80లు ఉండగా ఇక్కడ రూ.32, రూ.47లకు విక్రయించేవారు. ఆయిల్ ధరలు మార్కెట్లో పామాయిల్ (850 గ్రాముల ప్యాకెట్) రూ.120, సన్‌ఫ్లవర్ (910 గ్రాముల ప్యాకెట్) రూ.140లు ఉండగా ఇక్కడ రూ.110, రూ.120లకు విక్రయించే విధంగా బోర్డులను ఏర్పాటు చేశారు. టమాటాలు అయితే రెండు రోజులు కూడా విక్రయించ లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పోనీ ఈ దుకాణాలు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఏర్పాటు చేశారా? అంటే అదేమీలేదు. నియోజకవర్గ స్థాయిలో ఒక్కచోటే పెట్టారు. అంటే మండల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉండేలా ఈ షాపులు ఏర్పాటు చేశారు. ఏ సమయంలో వెళ్లినా షాపు మూసే ఉంటుంది. ఎంతో మంది పేదలు ఇక్కడి వచ్చి చూడడం, వెనుదిరగడం పరిపాటి అయ్యింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసరాల దుకాణాన్ని నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



మాచవరంలో నిత్యావసరాల దుకాణం (ఫైల్)



మూతపడిన నిత్యావసరాల దుకాణం

తప్పని ఉల్లికి పాట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహారాష్ట్రకు చెందిన మార్కెఫెడ్ నుంచి రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ఉల్లిపాయలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఉల్లిపాయల ధరతో పాటు నిత్యావసరాల ధరలు మండిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

మళ్లీ వెళ్తే మూసేసి..



మార్కెట్‌లో నిత్యావసర సరకులు ధరలు పెరిగిపోయాయి. తక్కువ ధరకే సరకులు వస్తాయని ఎంతో ఆనందించి ఆధార్ కార్డు తీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దుకాణం వద్దకు వెళ్లాం. ఉల్లిపాయలు, వంట నూనెలు తక్కువ ధరకే విక్రయించారు. మళ్లీ ఓ మూడు రోజులకు వెళ్తే షాపు తీయలేదు. ఎన్నిసార్లు వెళ్లినా షాపు మూసే ఉంటోంది. మా ఆశలన్నీ మూణ్నాళ్ల ముచ్చటేనా.

–ఉందుర్తి నాగబాబు, అంబాజీపేట

ఎటువంటి అనుమతీ లేదు



నిత్యావసరాలను తక్కువ ధరకు విక్రయించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు. అక్టోబర్‌లో వచ్చిన ఉల్లిపాయలు, పామాయిల్‌ను స్టాకు ఉన్నంత వరకూ విక్రయించాం. ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించాలని ఎటువంటి అనుమతులూ రాలేదు. అనుమతులు వస్తే ప్రారంభిస్తాం.

–జి.వెంకటేశ్వరి, తహసీల్దార్, అంబాజీపేట

శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

మలికిపురం: ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ ఆరో విడత శిక్షణను వాయిదా వేయాలని పీఆర్టీయూ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మలికిపురంలో గురువారం జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల చివరి వారంలో క్రిస్మస్ పండగ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, డిపార్ట్‌మెంట్ టెస్ట్ ఉన్నాయన్నారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో క్రైస్తవ సోదరులైన ఉపాధ్యాయులకు సెలవు వినియోగం, సెలవుల వాడకంలో ఎటువంటి ఆటంకం లేకుండా, ఈ నెల 23 నుంచి 28 వరకూ తలపెట్టిన శిక్షణ తరగతులను వాయిదా వేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ, ఉద్యోగులకు క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా జూలై 2023 నుంచి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అప్పారి రామకృష్ణ, పంగం నీలారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పద్మనాభం, ఆచంట పెద్దిరాజు, గిరిప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై నేడు శిక్షణ

అంబాజీపేట: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ సరోవర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

రావులపాలెం: మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గ్రామ, మండల అభివృద్ధి ప్రణాళికలపై ఒకరోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ మహేశ్వరరావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం: నరేంద్రపురం సబ్ స్టేషన్ పరిధి జి.పెదపూడి 11 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు. దీనివల్ల జి.పెదపూడి, జి.పెదపూడిలంక, ఊడిమూడి, ఊడిమూడిలంక, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

కొత్తపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం అభినందించారు. వాడపాలెం ఎమ్మెల్యే స్వగృహం వద్ద రావులపాలెం భాష్యం స్కూల్‌కు చెందిన పలువురు విజేతలను ఆయన అభినందించారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

అంబాజీపేట: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ జి.వెంకటేశ్వరి అన్నారు. ఇసుకపూడిలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల ఆన్‌లైన్ చేయించుకునేందుకు, కొత్త పాస్ పుస్తకాల కోసం, భూ విస్తీర్ణంలో వ్యత్యాసాన్ని సరి చేసేందుకు రైతులు అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారన్నారు. అనంతరం రైతులు 15 అర్జీలు ఇచ్చారు.

అయినవిల్లి: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగలక్ష్మమ్మ తెలిపారు. విలసలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎనిమిది అర్జీలు వచ్చాయి. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఆర్ఐ రాయుడు, సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: మోరి మాజీ సర్పంచ్ జాన విజయలక్ష్మి మృతికి రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు నివాళులర్పించారు. ఆమె భర్త జాన శంకరరావు (బాబ్జీ)ని పరామర్శించారు. అలాగే సఖినేటిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన కుసుమ జానకి కుటుంబ సభ్యులను గొల్లపల్లి పరామర్శించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నాయకులు కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, నల్లి ప్రేమానందం పాల్గొన్నారు. మోరి పంచాయతీలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి ఫ్లెక్సీ వద్ద పాలకవర్గ సభ్యులు నివాళులర్పించారు. సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, పి.భగవాన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మలికిపురం: మోరి మాజీ సర్పంచ్ జాన విజయలక్ష్మి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పరామర్శించారు. విజయలక్ష్మి భర్త ప్రముఖ వైఎస్సార్ సీపీ నాయకుడు జాన బాబ్జీ, ఆమె కుమారులు మల్లిబాబు, డాక్టర్ జేఎస్‌వీ ప్రసాద్, రవిశంకర్‌లను ఆయన ఓదార్చారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ ఎంపీపీ లింగోలు చిన్నబ్బులు, మాజీ సర్పంచ్ ముప్పర్తి త్రిమూర్తులు, వలవల రాంబాబు తదితరులు విజయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

రావులపాలెం: విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలని, తద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని మోటివేషన్ స్పీకర్, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర సూచించారు. స్థానిక సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో గురువారం మండలంలోని పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్‌ను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి హైదరాబాద్‌కు చెందిన మోటివేషన్ స్పీకర్ రాఘవేంద్ర ముఖ్య అతిథిగా హాజరై పదో తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఆకళింపు చేసుకుంటూ ప్రణాళికగా చదువుకోవాలన్నారు. ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. మండలంలోని తొమ్మిది హైస్కూళ్లకు చెందిన పదో తరగతి విద్యార్థులు హాజరై పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా, మాజీ సర్పంచ్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు టి.నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కె.అశోక్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్లు నందం సత్యనారాయణ, జి.సోమేష్, ఎంఈఓలు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న రాఘవేంద్ర

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

అయినవిల్లి: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీసౌజన్య తెలిపారు. గురువారం పల్లపులంకకు చెందిన మహిళకు రెండో కాన్పు పురుటి నొప్పులు రావడంతో వీరవల్లిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లక్ష్మీ సౌజన్య, స్టాఫ్ నర్స్ శైలజ పురుడు పోశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా వైద్యురాలు లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇప్పటి వరకూ వీరవల్లిపాలెం పీహెచ్‌సీలో పది సాధారణ ప్రసవాలు చేశామన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పరిసరాల శుభ్రతతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీహెచ్ఓ బి.అప్పారావు విద్యార్థులకు వివరించారు. అంబాజీపేట, మాచవరం, తొండవరం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలతో పాటు జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ విద్యార్థులకు రాష్ట్రీయ బాలుర స్వస్థ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎత్తు, బరువు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ పరిమిళ, ఏఎన్ఎం పల్లవి, ఎంపీహెచ్ఎ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాట్రేనికోనకు చెందిన వేదుల వెంకట కామేశ్వరి గురువారం రూ.10 వేలు అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజుకు దాత అందించారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ అందజేశారు.



దాత కామేశ్వరికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ సత్యనారాయణరాజు

పోలీస్ అధికారులకు సత్కారం



సఖినేటిపల్లిలో సీఐ, ఎస్సైలను సత్కరిస్తున్న టాండన్ రాజు, సహకార సంఘాల ప్రతినిధులు

సఖినేటిపల్లి: దోపిడీ కేసులో పోగొట్టుకున్న చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను పలువురు అభినందించారు. అంతర్వేదిపాలెంలో బీర సువర్ణరాజు ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. సుమారు రూ.పది లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల తరఫున మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు సీఐ, ఎస్సైలను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు, ప్రతినిధులు చింతా శేషు, బీర సువర్ణరాజు, గెద్దం బాలరాజు, నల్లి డేవిడ్, నల్లి శివకుమార్, గంటా దానియేలు, రాపాక రత్నకుమార్, జల్లి నరసయ్య, చొప్పల శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తపేట: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, వకృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. వకృత్వంలో జి.విజయ్‌కుమార్, డి.యశ్వంత్ శ్రీసాయి, కె.శ్రీలోకేష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వ్యాసరచన పోటీల్లో ఎం.స్టీఫెన్, పి.దుర్గాప్రసాద్, సీహెచ్ సువర్ణ రత్నం మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరు ఈ నెల 27న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు రూ.3 వేలు, రూ. 2 వేలు, రూ.1500 చొప్పున నగదు బహుమతులు అందజేసినట్టు ఎంఈఓ హరిప్రసాద్ తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు: డీఈఓ



తొత్తరమూడి పాఠశాలలో విద్యార్థుల విద్యా స్థాయిని పరీక్షిస్తున్న డీఈఓ సలీం బాషా

అయినవిల్లి: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. మండలంలోని క్రాప, తొత్తరమూడి ఎంపీ యూపీ స్కూళ్లు, కె.జగన్నాథపురం జెడ్పీ హైస్కూళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల భావి జీవితానికి బలమైన పునాదులు వేయాలన్నారు. తొత్తరమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ఏ విధమైన సెలవు చీటీ లేకుండా గైర్హాజరు కావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత ఉపాధ్యాయుడి నుంచి వివరణ తీసుకోవాలని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావుకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా స్థాయిని ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలో పలు పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



నిరసన తెలుపుతున్న పంచాయతీ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

అయినవిల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు నల్లచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. డివిజనల్ నాయకుడు గుంద్రు సత్యనారాయణ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. అనంతరం అయినవిల్లి మండల పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గుమ్ములూరి అనిల్‌కుమార్, సెక్రటరీగా తాడి శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోల నాగబాబు, దాకి జార్జి, గుర్రం రాంబాబు, కాగిత రామకృష్ణ, రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ ఫలాలు అందించాలి

అయినవిల్లి: వెనకబాటుతనం ఆధారితంగా ప్రాధాన్య మార్కులు ఇవ్వడం, లేక రోస్టర్ పద్ధతి ద్వారా అత్యంత వెనుకబడిన వారికి రిజర్వేషన్ ఫలాలు అందించాలని ఎస్సీ ఉప కులాలు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు గురువారం కాకినాడలో వినతి పత్రం అందజేసినట్లు న్యాయవాది బడుగు భాస్కర్ జోగేష్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీల్లో ఏబీసీడీ వర్గీకరణ విఫలమైన కారణంగానే అత్యంత వెనుకబడిన సామాజిక వర్గం (ఎంబీసీ) ఏర్పడిందని తెలిపారు. 59 ఉప కులాలను నాలుగు వర్గాలుగా విభజిస్తే అందరికీ సమన్యాయం అందదని వివరించారు. వస్కా శ్యాంసుందర్, పిల్లి కన్నబాబు, బి.వెంకటేష్, బి.అగ్ని, పి.నాని, కుమ్మరి రమణ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది భాస్కర్ జోగేష్